# మంత్రిగారి మాతృభూమి

యం. గుంపస్వామి

"గోబేక్ టుద విలేజెస్" అని గాంధీతాత అన్నారు కాబట్టి ఓ విలేజి కథలోకి పోదాం.

అదో దిక్కుమాలి నూరు. ఆ వూరికో పేరుంది, గాని దాని పేరుకంటె తన పేరే ముందుకు రావాలని ఓ మహా పురుషుడు కంకణం కట్టుకొని "అప్పలనాయుడొలస" అనే పేరు తేవడానికి తన పర్సుతోపాటు ప్రెసిడెంటుగా తన పవర్సుకూడా ఉపయోగించి ఆ వూరిని తన సొంతం చేసుకున్నాడు.

ఒక్క పేరు సొంతం చేసుకుంటె ఏ చిక్కూ లేదు, పోరంబోకుగా పడివున్న స్థలాలు పొలాలతోపాటు అవసరానికి భార్యల్నికూడా ఉపయోగించుకొనే అపర ధర్మరాజుల్ని, హరిశ్చంద్రుల్ని, వాళ్ళ 'పేణాల్ని'కూడా సొంతం చేసుకున్నాడు అప్పలనాయుడు.

ఒకప్పుడు అప్పలనాయుడు మిద్దె ఇంట్లో వుంటుండేవాడు. మిగతా వాళ్ళలో కొందరికి పెంకుటిళ్ళుకూడా వుండేవి. కాని అప్పలనాయుడు కండలు పెంచేక అవన్నీ పూరిండ్లయిపోయి అతానిది మాత్రం మరో ఎల్.ఐ.సి. బిల్డింగై పోయింది!

ఆ వూర్లో ఒక్క అప్పలనాయుడు తప్ప మిగతావాళ్ళంతా 'కూలి ముండాకొడుకులు' కాబట్టి వాళ్ళందరి దగ్గర చెమట వాసన కొడుతుందిగాని, అప్పలనాయుడు దగ్గర మాత్రం మరికొళందు సెంటువాసన గుప్పుమంటుంది. ఏ 'కోకైనా' సెంటు వాసన కొట్టిందంటె అది అప్పలనాయుడు కింద నలిగిందన్న మాటే!

ఆ మధ్యనైతే సిల్కు లాల్చీలో వుండే అప్పలనాయుడు ఈ మధ్య ఖద్దరుపై పడ్డాడు. టోపీ లేదుగాని....వుంటే, పాతికేండ్ల జైలు జీవితాన్ననుభవించిన నికార్సైన రాజకీయ ఖైదీలా వుంటాడు. పూర్వం నెత్తిమీద గంతం లాంటి పిలక మూతిమీద గడ్డిలా పెరిగిన మీసము వుండేవి. అవన్నీ పోయి చాలారోజులైందనుకోండి. మరో విశేష మేమిటంటె, ఈ మధ్య అప్పలనాయుడు తన సంతకం తనే చేసేయడం నేర్చుకోవడంచేత, మిగతావాళ్ళు అలా చేసుకోడానికి వీల్లేకుండా ప్రతీదానికి శుక్రాచార్యుడిలా అడ్డు తగులుతుండేవాడు.

ఆ వూరికి ఉత్తరాన ఓ చెఱువుంది. దానికో గట్టుంది. ఆ గట్టు ప్రక్క ఓ ఇల్లుంది. అది శిధిలావస్థలో వుంది. అందులో సత్యం అనే రిటైర్డ్ టీచరు తన ఆఖరు దశను గడుపుతున్నాడు. సత్యానికి తన మాతృభూమిపై 'ది ఎన్డ్' అనిపించేద్దా మనే కోరిక తప్ప మరేదీ లేదు. అందుకే ఎక్కడో రాలిపోవడం ఇష్టం లేక స్వగ్రామంలో రాలిపోదామని అప్పలనాయుడొలస వచ్చాడు.

పదిహేనేళ్ళ క్రితం ఊరిలోకి రావాలంటే గోర్జిగుండా నడిచిరావాలి. వర్షంపడితే మోకాలులోతు బురదలో భరతనాట్యం చేస్తూ నడవాలి. 'నీటి దీపాలు' ఇంకా రాని కారణాన చీకటి పడగానే నిద్రపోయేవారు. అవసరాలకు డబ్బు చాలకపోతె, రక్తం అమ్మితే పదిహేను రూపాయలిస్తారని, కుటుంబ నియంత్రణ చేసుకొంటే ఎనభై రూపాయిలిస్తారని తెలిసి ఆ వూరి 'పెజానీకం' అప్పలనాయుడు దగ్గిర అప్పులుచేసి సొంత పొలమనేది సెంటుకూడా లేకుండా పోవడం మామూలై పోయింది.

అవన్నీ ఇప్పటికీ అలాగే వున్నాయిగాని, ఆ వూరిపేరు మాత్రం అప్పలనాయుడు డొలసగా మారిపోవడం సత్యానికి ఆశ్చర్యం కలిగించింది.

ఆ వూర్లో ఆడుకోడానికో జూదశాలుంది. తాగడానికో గవర్నమెంటు సారాయి దుకాణముంది. తిక్క రేగితె తగ్గించుకోటానికో తవిటమ్మ కంపెనీ వుంది చేతులు జోడించి

పాపాన్ని తుడిచేసుకోడానికో గుడి వుంది కాని చేతలు వారి రాతలు మార్చుకోడానికో బడి మాత్రం లేదు!

అదే వుంటే సత్యం మాష్టారుగా మరో ఊళ్ళో ఎందుకు పడేస్తాడు? ఆ వూరిలో కాస్తంత చదువుకోవాలనే యావవున్న కుర్రాళ్ళు గొంతుల వరకు బురదలోదిగి ఆకలి నార్పడానికో కప్ప చల్దొన్నంతో అఆ ల కోసం అవురావురుమంటూ ఐదు మైళ్ళ చేరువలోనున్న స్కూలు కెందుకెళతారు? అప్పుడప్పుడు వర్షం వస్తే జ్వరం గిరం వచ్చి జగన్నాథాచారి మంటి మాత్రలు మింగి ఆరోగ్యం క్షీణించి అర్ధాయుష్షులోనే హరీమని ఎందుకంటారు??

ఇవన్నీ మెడకాయమీద తలకాయున్న ఏ తండ్రీ ఆలోచించలేదు చివరకు ఆ వూరికి తండ్రి కాకపోయినా రంకు మొగుడులా చెలామణీ అవుతున్న అప్పలనాయుడూ ఆలోచించలేదు



కాని ఎవ్వడికీ ఏమీ కాని సత్యం మాష్టారు మాత్రం రాత్రీ పగలూ ఆలోచించేడు

అలా ఆలోచిస్తూ చెఱువు గట్టుమీద యోగ ముద్రతో కూర్చున్నట్టున్న సత్యాన్నిచూసి నీటికెళ్ళిన ఆతివలు పిచ్చిపంతులు పరమాత్మలో కలిసిపోనాడేటో! అనుకున్నారు మిగిలిన పెజానికం బుద్ధిమారి బుద్ధుడై పోనాడేటో అనుకున్నారు.

కాని అప్పలనాయుడు మాత్రం ఆ వూరి కంతటికీ తెలివైనవాడు కొబట్టి అలా అనుకోలేదు రెండరటిపళ్ళు గ్లాసుడు మజ్జిగ తీసుకెళ్ళి ఎటిమేస్ట్రూ! నిరాఆరదీచ్చ నేత్తన్నావట! ఎటికత అని అడిగాడు

అప్పుడే కళ్ళు తెరిచిన సత్యం పక్షికి భాషుంది చెట్టుకి భాషుంది కాని ఇక్కడి మనుష్యులకు భాష రాకపోవడం విడ్డూరం తక్షణమే ఓ బడి కట్టించాలి అప్పు తీసుకున్న పత్రాలమీద ఎంతమంది తమ సంతకాలు పెట్ట గలుగుతున్నారు? రాజులు పోయారు రాజ ముద్రికల వ్యవహారాలూ పోవాలి! కనీసం

చాకలి పద్దయినా ఎవడిది వాడు వ్రాసుకోడానికి నేచుకోవాలి" అన్నాడు సత్యం.

దానికి అప్పలనాయుడు ఆ వూరు అదిరి పోయేలా, ప్రక్కనున్న చెఱువు కదిలిపోయేలా పెద్దగా నవ్వాడు. "ఏటి మేస్ట్రూ!....సాకలి పద్దా!-అసలెవుడొంటిమీదైనా బట్టున్నాదేటి?" అన్నాడు వెకిలిగా.

సత్యంను ఎవరో కొరడాతో కొట్టినట్లని పించింది.

సహనంగా "మన ఊర్లో బడి లేక పిల్లలు చాలా బాధలు పడుతున్నారు. నేటి బాలలేకదా రేపటి పౌరులు. కాబట్టి బడి కట్టించునాయుడూ" అని అర్థించాడు సత్యం.

"ఏటీ! బడా! దేనికి? (సదువుకొని నన్నునగ దొక్కడానికా?) ఈ వూరి లుండేది పశువులు. కాబట్టి పశువులాస్పత్రి కట్టమను..... తెల్లారే సర్కి నెక్కపోతే .... నీ సెప్పిచ్చుకొక్కట్టు!" అన్నాడు అప్పలనాయుడు.

సత్యం నెత్తిన సమ్మెట దెబ్బ పడిన ట్లయింది. "ఏమిటీ? ఈ వూరిలో వుండేది పశువులా? వీళ్ళు మనుషుల్లా కనపడ్డంలేదూ? ఈ ఊరిలో పెద్దవని చెప్పాను. నీ సాయం అవసరంలేకుండా నెల రోజుల్లో బడి లేప గలను" అన్నాడు సత్యం దృఢంగా.

ఉన్నట్టుండి అప్పలనాయుడు అనుచరుల్లో కుడిభుజం టపీమని క్రిందపడి పూనకం వచ్చిన వాడిలా కొట్టుకోవడం మొదలుపెట్టేసరికి అది చూస్తున్న 'పెజానీకం' భయపడిపోయారు.

"సూసినారా, .... ఈ పంతులు మాటకు పట్టిన గతి!....మనూరికి సదువబ్బదు! నాకేటి నోటు? సదువురాక మానేసినానేటి? మరి మీరంతా నాకు మొక్కడంనేదూ....బుర్రుండాలి గాని, బడితో పనేటి? ఈ పిచ్చి పంతులు మాటింటె సెడిపోతారుగాని....ఎల్లి మీ పనులు సూసుకోండెహె!" అని చుట్టూ మూగిన 'పెజానీకాన్ని' విదిలిస్తూ అప్పలనాయుడు తన ఇంద్రభవనంలోకి గానాబజానా నిమిత్తం ఆ నాటి సభచాలిస్తూ వెళ్ళిపోయాడు.

"అవును మనదద్ది సెప్పిందే కరకట్టు" అనుకొని అప్పలనాయుడొలస 'పెజానీక'మంతా చెల్లాచెదురై పోయారు.

అప్పలనాయుడు ఆ వూర్లో అందరికీ వరసౌతాడు. ఆ వరస అతనికో వరంలాంటిది. పైగా మాట చేయనివని నోటు చేస్తుందనే నగ్న సత్యాన్ని ప్రతీ ఐదేళ్ళకూ జరిగే ప్రెసిడెంటు ఎలక్షన్లో తెలిసి, గెలిచిన 'రాజకీయపు బుర్ర' అతనిది.

సత్యం టౌనెళ్ళాడు. పల్లెకు పశ్చిమాన వనికిమాలిన భూమిపై బడి కట్టేందుకు స్థలం, కలెక్టరుద్వారా సంపాదించాడు సత్యం.

ఆ కాగితం చూసిన అప్పలనాయుడు "కాయితమైతె తెచ్చుకున్నావుగాని, ఆ స్థలం నాది. ఈ కాయితమంత సులువుగా రాదు మేస్ట్రూ! అత్తసొమ్ము అల్లుడు దారపోసినట్టుందీ యవ్వారం? నా ఊరుమీద, నా భూమ్మీద కన్నేసిన ఆ కలకటేరు ఏమై పోతాడో కానుకోనేకపోనాడు! ఎల్లుండి రేపి పాటికి అడ్నీ 'జమ'నేసీడంగాని, అండమానం దీవాలకి జెండా ఎత్తించేదంగాని సెయ్యింపక పోతే, నాపేరు అప్పలనాయుడే కాదు!" అని తొడ చరిచి, మీసం లేదు కాబట్టి జుత్తు నులుపి, అనుకున్నది సాధించడానికి అప్పల నాయుడు హైదరాబాద్ వెళ్ళాడు.

ఆ వూరి చుట్టూ మరో మూడు పల్లెలున్నాయి. అందులో ఎవరికీ నోరులేని కారణాన అవి అప్పలనాయుడొలసకన్నా హీనంగా, దీనంగా వున్నాయి.

మంచి ముహూర్తాన సత్యం మళ్ళీ టౌనెళ్ళాడు. అవసరమైన అధికారుల్ని కలుసుకున్నాడు. "కనీసం నాలుగూళ్ళ కొకటైనా బడి వుండాలని పట్టుపట్టి స్థలం తనకు ప్రభుత్వం శాంక్షన్ చేసిందని,అవసరమైతె తల తాకట్టు పెట్టయినా బడి కడతానని" భగీరథ ప్రయత్నం చేసి మొత్తంమీద ఎలాగైతే నేమి సాధించాడు.

నాలుగు పల్లెలు కలిసేచోట బడికట్టి "పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేసే ప్రయత్నంచెయ్యండ"ని విడివిడిగా ఒకొక్కూరుని, ఊరు పెద్దని కలసి బ్రతిమలాడాడు సత్యం.

అంతవరకూ ఆకలేస్తే తినడం, నిద్రవస్తే పడుకోవడం తప్ప వేరే ఏమీ తెలీని ఆ మూడూళ్ళ పెద్దలు మూడో నేత్రం తెరిచారు. "అప్పను వుండాల్సిందే" అని ముక్త కంఠంతో ఒప్పుకొని తలా ఏదో సహాయం చేస్తామని పద్యాలు పాడుతూ బాసలుచేశారు.

ఆ రోజు కప్పులేని నాలుగ్గోడల మధ్య నున్న గదిలో చుక్కల్ని చూస్తూ....భవిష్యత్తు నాలోచిస్తూ హాయిగా నిద్రాదేవి ఒడిలో ఒరిగాడు సత్యం.

అప్పలనాయుడు వెళ్ళిన కార్యం 'పండు' చేసుకొని పండ్ల గంపతో ఊర్లో పడ్డాడు. కుడిభుజం ఎడమభుజాలుగా పేరుపడ్డ పోలి నాయుడు, తవిటి నాయుడులు చెప్పిన మాటలకు అప్పలనాయుడు నోట్లోని చుట్ట జారి క్రింద పడింది. ఎడమకన్ను ఎడమభుజం అదిరాయి. పెరట్లోని కోడెగిత్త రంకెవేసి పలుగు తెంపి పరుగు తీసింది. దాని కాలిక్రింద ఓ గుడ్డి గవరయ్య నలిగి శవాలిలిష్టులో జమ అయి పోయాడు. విధివశాత్తూ చనిపోయిన గుడ్డోడి చావుకు, సత్యం మాష్టారి బదే కారణమని అప్పలనాయుడు చేసిన ప్రచారం మూఢులపై బాగా పనిచేసింది.

సత్యాన్ని పిలిపించిన అప్పలనాయుడు "ఏటిమేస్ట్రూ! నాను రెండు పూట లూరిలో నేదిపోయేసరికి ఇంత కత నడిపేవా? నాలుగు పూటలైతె నా పెళ్లాం సేతే సీ!సీ! అనిపించేద్దు వన్న మాట. పల్ల కూరుకోడం సేతకాకపోతే... తద్దినం మంత్రాలు నాలుగు నేర్చుకో....మా వూర్లో బోల్డంతపని. అంతేగాని, నా మాట కాదని ఎదురు తిరిగినావో....జమ అయిపో గలవు! ఈ నాలుగూళ్ళకు నాయకుడ్ని. నాతోని మంచిగున్నావనుకో .... ఆరు పదులు నిండి పోగానే సట్టిపూజ, నూరేలు నిండిపోగానే పెద్ద కర్మ పద్దతి పెకారం ఓరాలేకుండా జరిపించే తాను. నేదనుకో....కాకులుకూడా సీకేసిన ముద్ద ముట్టుకోనివ్వను!" అంటూ మరో చుట్ట వెలిగించాడు.

సత్యం ఎప్పటికీ లొంగక పోయేసరికి "పోనీ గవరమెంటోలు బడికోసం సీకిచ్చిన జాగాతో మరో పదెకరాల మడిసెక్క సీ సొంతమైపోద్ది. ఇప్పుడూ....అను!" అన్నాడు సగంలో ఆరిన చుట్టను మరోమారు వెలిగిస్తూ.

కాని అప్పుడూ సత్యం 'ఊ' అనలేదు. తను మాటలవాడు కాడు. చేతలవాడు. అందుకే చరచరా అక్కడనుండి వెళ్ళిపోయాడు.

అప్పలనాయుడు నిప్పు తొక్కిన కోతై పోయాడు. ఏ ధైర్యంతో సత్యం తనకు ఎదురు తిరుగుతున్నాడా అని ఓసారి తన పరిసరాల చుట్టూ దుర్భిణీవేసి చూశాడు. ప్రక్క మూడూళ్ళ పెద్దలు కనిపించారు. "మూర్కపు నంజాకొడుకులు" అనుకుని 'అరిజంట'ని రమ్మని కబురుపంపాడు.

నిమిషాలమీద రెక్కలుకట్టుకొని ముగ్గురూ అప్పలనాయుడు ముంగిట వాలి "మేంసేసిన అపరాదమేటి మాప్రో!" అన్నారు వణకుతూ.

'మొన్నటి ఎలచ్చన్లో సొమ్ము తీసుకొని ఎదురు పచ్చానికి ఓటు వేయించావని' ఒకట్ని, 'నీ కూతురు కులం తక్కువోడి పక్కన తొంగుంటె నీ కొల్లుమంది అడ్నక్కడే కూసి సేసేవని' ఒకట్ని, రామాలయం కడతానని సెప్పి దండిన సొమ్ములో సగంతీసి, నీ ఇల్లు కట్టుకున్నావని' ఒకట్ని భయపెట్టేడు అప్పలనాయుడు.

"బాబ్బాబు మా కిప్పుడేటి దారి?" అన్నారు కోరస్‌గా వాళ్ళు.

అప్పలనాయుడు "రండి కూకోండి, సెప్తాను" అని రమ్ము సీసాల కార్కులూడ దీసి, ఆ ముగ్గురి నోళ్ళకూ బిరడాలు బిగించాడు. అంతేకాదు. "సంగంలో మనకో పేరూ, పెత్తేకతా రావాలంటె .... మానూళ్ళ మద్దె గాంధీతాత ఇగ్గరం కట్టి, ఏ మినిష్టరు సేతో ఓపినింగు సేయించేత్తే..... మన పేరులు గుప్పుమని పోతాయి! అపుడు నేను రాజు నువు మంతిరి!! అన్నట్టు పథకం బ్రహ్మాండంగా తయారుచేశాడు అప్పలనాయుడు.

తాగివోళ్ళంతా సత్యహరిశ్చంద్రులై ఒకే మాటపై నిలబడి, బడి కట్టాల్సిన స్థలంలో ఓ మహాత్ముడి విగ్రహం మూడు వారాలు తిరక్కుండానే కట్టించి, సభలు జరిపించి, చప్పట్లు మోగించి తమ దేశభక్తిని చాటుకున్నారు.

పాపం 'పెజానీకం' పశువుల్లాంటోలు కాబట్టి ఆ దుష్ట చతుష్టయం చేసిన పనులకల్లా తలాతోక ఊపేశారు.

ఇన్నాళ్ళూ దేశానికి, తమ ఊరికి, తమ ప్రజలకు సేవచేసిన సందర్భంగా అప్పలనాయుడు ఎం.ఎల్.ఎ. అయ్యాడు. అంతేకాదు సంతకం వచ్చినవాడు కాబట్టి మంత్రికూడా అయ్యాడు.

మంత్రిగారి మాతృభూమిపై పాపం సత్యానికి తావులేదు!

# మానవ జీవితంలో జంతువులు

మానవులకీ జంతువులకీ అవినాభావ సంబంధం వుంది. మానవుడుకూడా ఒకప్పటి జంతువేనంటారు శాస్త్రజ్ఞులు. మానవుని జీవితాలతో జంతువులకి సన్నిహితత్వం వుంది. సంభాషణల్లో జంతువులు చోటు చేసుకొని చమత్కారాన్ని కలిగిస్తాయి — భావస్ఫూర్తి నిస్తాయి—హాస్యాన్ని జనింపచేస్తాయి.

మోసాలు చేసేవాడ్నీ, నమ్మకద్రోహినీ 'నక్క' అని అంటాం. "గుంటనక్కలా కాచుక్కూర్చున్నాడు" అనే ప్రయోగంకూడా వుంది. సాధుస్వభావం గలవాడికి 'గోవు' అనీ, వ్యక్తిత్వం లేకుండా గుడ్డిగా అనుకరించేవాడికి 'గొర్రె' అనీ, ఎవర్నీ లక్ష్యపెట్టకుండా ఇష్టం వచ్చినట్టు తిరిగేవాడికి "అచ్చోసిన ఆంబోతు" అనీ ముద్దుపేర్లు పెట్టుకుంటాం. ఎటు అనుకూలంగా వుంటే అటు చేరే తత్వంగల అవకాశవాదిని 'గోడమీద పిల్లి' అనో 'ఊసరవెల్లి' అనో పిలుస్తాం. హంస నడకలూ, మీన నేత్రాలూ స్త్రీ జాతికి వరాలు.

చిలకా గోరింకల్లా జీవించే దంపతులు ఈ కాలంలో అడుగడుగునా కనిపిస్తారు. మనకి కోర్టు 'పక్షులకి' కొరతలేదు. రాజకీయ నాయకుల 'చిలక పలుకులు' అందరికీ తెలుసు. కొన్ని కొన్ని సందర్భాల్లో జలగల్లా పట్టుకొంటేగానీ పనులు కావు. 'కోతి' చేష్టలకీ, 'కాకి' గోలకీ విద్యార్థుల్లో చాలామందికి పెట్టింది పేరు. కొందరి స్వరం 'కోకిలారావం' అయితే మరికొందరిది 'గార్దభస్వరం' మరి విశ్వాసానికి 'కుక్క'ని చెప్పుకోవల్సిందే. ఎవరెన్ని ఉపన్యాసాలు చేసినా మన ప్రణాళికలూ, మన విధానాలూ మాత్రం 'నత్తనడక'నే పరిస్తాయి. చిత్తశుద్ధి లేని "కొంగ జపం" స్వాములు మన మధ్యనే జీవిస్తున్నారు. స్వార్థం కోసం ఇతరుల్ని బలిగావించే 'రాబందులు' మనకి దర్శనమిస్తూనే వుంటాయి. 'కప్పదాటులు వెయ్యడం, 'పేను'కి పెత్తనం ఇవ్వడం తగదని మనకి తెలుసు.

నిత్యజీవితంలో మనం వాడే సామెతల్ని పరిశీలించండి:—(1) కాకిపిల్ల కాకికి ముద్దు (2) పులినిచూచి నక్క వాతలు పెట్టుకున్నట్టు (3) దున్నపోతుమీద వాన (4) మొరిగే కుక్క కరవదు (5) గుర్రం గుడ్డిదయినా దాణా తప్పదు (6) ఏనుగు చచ్చినా బతికినా ఒకటే విలువ (7) పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం (8) పిల్లికి ఎలుక సాక్ష్యం (9) పంది పన్నీరుని మెచ్చుతుందా (10) కాకి ముక్కుకి దొండపండు.

ఈ విధంగా జంతువులు మానవ జీవితంలో చోటు చేసుకొని మీరు మానవత్వం నుంచి పశుత్వంలోకి దిగజారకండి సుమా అని హెచ్చరిక చేస్తూంటాయి.

—ధ్వా. నా. శాస్త్రి